# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 31-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గురు రవిదాస్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పంజాబ్‌లో పర్యటించనున్నారు.
- ❖ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.
- ❖ ఉగ్రవాదం పట్ల "జీరో టాలరెన్స్" అనేది రాజీలేని ప్రపంచ ప్రమాణంగా ఉండాలని కేంద్రమంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ భారత్ - న్యూజిలాండ్ జట్ల మధ్య తిరువనంతపురం వేదికగా ఐదో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

======================

గురు రవిదాస్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. గురు రవిదాస్ గొప్ప సామాజిక సంస్కర్త అని, ఆయన తనబోధనల ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం, ప్రేమ సందేశాన్ని అందించారని సామాజిక మాధ్యమంలో రాష్ట్రపతి పేర్కొన్నారు. గురు రవిదాస్ ఆలోచనలు ఎల్లప్పుడూ సందర్భోచితంగా ఉంటాయని, మానవ విలువలకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ గురు రవిదాస్ బోధనలను ఆదర్శంగా తీసుకొని జాతి నిర్మాణంలో ఉత్సాహంగా పాల్గొనాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

======================

సమ్మిళితమైన, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి చేతివృత్తి కళాకారులను బలోపేతం చేయడం ఎంతో అవసరమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్‌లో 39వ అంతర్జాతీయ హ్యాండ్ క్రాఫ్ట్ మేళా-2026ను ఉపరాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా "మేళాసతి" యాప్‌ను కూడా రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... శతాబ్దాల

కాలం నాటి నుండి దేశంలో చేతి వృత్తుల వారు ఎంతో జ్ఞానం కలిగి ఉన్నారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సాంప్రదాయ చేతివృత్తుల రంగం పునరుజ్జీవనానికి కేంద్రంగా నిలిచాయన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన వంటి కార్యక్రమాలు చేతివృత్తుల వారిని ప్రోత్సహించడంతో పాటు.. నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాధికారతను అందిస్తున్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సంత్ గురు రవిదాస్ 649వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పంజాబ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి ఆదంపూర్ విమానాశ్రయానికి “శ్రీ గురు రవిదాస్ జీ విమానాశ్రయం, ఆదంపూర్”గా నామకరణం చేస్తారు. అనంతరం లుధియానాలోని హల్వారా విమానాశ్రయంలో టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభిస్తారు. ఈ టెర్మినల్ భవనం రాష్ట్రానికి కొత్త ముఖద్వారంగా మారనుంది. లుధియానా దాని చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక, వ్యవసాయ ప్రాంతాలకు ఎంతో మేలు చేస్తుంది. అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జలంధర్ జిల్లాలోని డేరా సచ్‌ఖండ్ బల్లన్‌ను సందర్శించి... సంత్ గురు రవిదాస్ జీ గౌరవార్థం నిర్వహించే బహిరంగ కార్యక్రమంలో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం పట్ల “జీరో టాలరెన్స్” అనేది రాజీలేని ప్రపంచ ప్రమాణంగా ఉండాలని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 2వ భారత్ - అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశం ప్రారంభ ఉపన్యాసంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అది ఇరు దేశాలకు ఉమ్మడి ముప్పు అని అన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, దౌత్యపరమైన ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించే సరిహద్దు ఉగ్రవాదం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్త మహమ్మారిని ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. దిగువ సభలో బడ్జెట్‌ను సమర్పించిన అనంతరం.. బడ్జెట్ కాపీని రాజ్యసభలో ప్రవేశపెడతారు. ఆర్థిక మంత్రిగా సీతారామన్ 2019 నుండి వరుసగా తొమ్మిదవ సారి బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నారు. పార్లమెంటులో బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత బడ్జెట్ పత్రాలు మొబైల్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. కేంద్ర బడ్జెట్ సమర్పించిన తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది కళాశాల విద్యార్థులతో ఆర్థిక మంత్రి సంభాషిస్తారు. ఆర్థికవేత్తలు, కార్మిక సంఘాలు, విద్య, ఆరోగ్య రంగం, MSME, వాణిజ్యం, సేవలు, పరిశ్రమలు, ఆర్థిక రంగం, మూలధన మార్కెట్ల నిపుణులు, ప్రతినిధులతో సహా అనేక మంది వాటాదారులతో బడ్జెట్ ముందు కేంద్రమంత్రి నిర్మాల సీతారామన్ సంప్రదింపులు, సమావేశాలు నిర్వహించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ భద్రతకు భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. పశ్చిమ బెంగాల్ లోని బరాక్‌పూర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అక్రమ చొరబాట్లను ప్రభుత్వం అరికట్టలేకపోయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల సరిహద్దు ప్రాంతంలో కంచె వేయలేకపోయామని, తాము అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో రాష్ట్రంలో సరిహద్దు కంచె వేస్తామన్నారు. SIR ప్రక్రియను ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ అది రాష్ట్రంలో కొనసాగుతుందని అమిత్ షా స్పష్టం చేస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని ఎటా జిల్లాలోని పాట్నా పక్షుల అభయారణ్యం, గుజరాత్‌లోని కచ్ జిల్లాలో చారి-ధండ్‌లను రామ్‌సర్ ప్రదేశాల జాబితాలో చేర్చినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖల మంత్రి భూపేందర్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రెండు చిత్తడి నేలలు వందలాది వలస, నివాస పక్షి జాతులకు ఆవాసాలను అందిస్తున్నాయని కేంద్రమంత్రి తెలియజేశారు. ఈ ప్రాంతాలు అంతరించిపోతున్న పక్షులతో పాటు చింకారా, తోడేళ్ళు, కారకల్, ఎడారి పిల్లులు, నక్కలు వంటి వన్యప్రాణులకు కూడా నిలయంగా ఉన్నాయని తెలిపారు. రామ్‌సర్ ప్రదేశాల జాబితాలో రెండు కొత్త చిత్తడి నేలలు చేర్చడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ జిల్లాల ప్రజలను సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - ఈయూ (EU) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో (FTA), ఐరోపా సమాఖ్యకు భారత్ చేసే ఎగుమతులు ఐదేళ్లలో రెట్టింపు అవుతాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఉద్ఘాటించారు. వ్యాపారవేత్తలు, MSMEలు, స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అంతర్జాతీయ స్థాయికి ఎదగడంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రముఖ జాతీయ దినపత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలను సామాజిక మాధ్యమంలో పంచుకుంటూ కేంద్రమంత్రి ఈ విషయాలను వెల్లడించారు. ఈ వాణిజ్య ఒప్పందం దేశానికి వివిధ మార్గాల్లో ఏవిధంగా ప్రయోజనం చేకూరుస్తుందో ఆయన వివరించారు. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశంలోని సున్నితమైన రంగాలను రక్షిస్తూనే.. భారత్‌కు భారీ అవకాశాలను కల్పించే ఒక శక్తివంతమైన ఒప్పందమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఉన్న నమ్మకం ఆయన మార్గదర్శకత్వం ఫలితంగా ఈ వాణిజ్య ఒప్పందం వేగంగా ముగింపు దశకు చేరుకుందని తెలిపారు. ఈ ఒప్పందం దేశ ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని, ఇది కేవలం వాణిజ్యానికే పరిమితం కాకుండా, తయారీ రంగాన్ని కూడా వృద్ధి పథంలో నిలుపుతుందని పీయూష్ గోయల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య తిరువనంతపురం వేదికగా ఐదో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 18 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. భారత బ్యాట్స్‌మెన్లలో ఇషాన్ కిషన్ 103, సూర్యకుమార్ యాదవ్ 63 పరుగులతో రాణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =